# డిస్కౌంట్ సేల్

ఉపద్రష్ట సాయి

**పెళ్ళి చూపులు పూర్తయ్యాయి. అమ్మాయిని లోపలికి తీసుకుపోయారు. అబ్బాయి తాలూకు తల్లిదండ్రులు అమ్మాయి తండ్రితో మాట్లాడాలని ప్రక్క గదిలోకి వెడదామన్నారు. అబ్బాయి మాత్రం హాల్లో కూర్చున్నాడు.**

ప్రక్క గదిలోకి వెళ్ళిన వాళ్ళు లావాదేవీ సంభాషణలు ప్రారంభించారు.

"చూడండి! అబ్బాయికి అమ్మాయి వచ్చినట్టే వుంది. ఇద్దరి జాతకాలు కూడా పొందికగా వున్నాయి. ఇహపోతే కట్నకానుకల విషయాలు తీర్మానించుకుంటే త్వరలో ముహూర్తం పెట్టుకుని పెళ్ళి జరిపించుకుందాం!" అన్నారు నారాయణ రావు గారు.

మా కుటుంబం గురించి, ఆర్థిక పరిస్థితి గురించి పేరయ్య గారు మీకు అంతా చెప్పే వుంటారు. నేను రిటైరైన బడి పంతుల్ని. ఈ అమ్మాయి కాకుండా మరో అమ్మాయి, ఒక అబ్బాయి వున్నారు. అబ్బాయి మానసిక వికలాంగుడు. వాడు సరిగ్గా నడవలేడు కూడా. మాటలూ అంతంత మాత్రమే వస్తాయి. వాడి బరువు బాధ్యతలు మా మీదే వుంటాయి చివరిదాకా. కనుక వీటిని దృష్టిలో పెట్టుకుని మీరు అడగండి. ఏ తండ్రికైనా కూతురి భవిష్యత్తు బాగుండాలని, అందుకోసం వీలైనంత మేరకు లాంఛనాలు జరిపించాలనీ వుంటుంది. నా శక్తి మేరకు నేను చేస్తాను. అడగండి!" అన్నారు కృష్ణమూర్తి గారు.

"పేరయ్య గారు అంతా చెప్పారెండి. అందుకే మేము కూడా ముందర తటపటాయించాము. ముఖ్యంగా మీ అబ్బాయి పరిస్థితి విన్న తరువాత కొంచెం బాధపడ్డాము కూడా. కానీ మన చేతిలో ఏం వుంది చెప్పండి? అంతా దైవ నిర్ణయం. మా మరో సమస్య ఏమిటంటే మీ అబ్బాయి భవిష్యత్తు. మీ తదనంతరం ఆ అబ్బాయి బరువు బాధ్యతలు ఎవరు మోస్తారా? అని. అందుకే ఆలోచించాము. కానీ పేరయ్య గారు ఆ భయాలేమీ వద్దు.. ఆ అబ్బాయిని వికలాంగుల హోమ్‌లో చేరుస్తారు" అనడంతో మళ్ళీ మా నిర్ణయం మార్చుకున్నాము" అన్నారు నారాయణ రావు గారు.

ఆయన మాటలు కొంచెం బాధ కల్గించినా బాధ ఒగ్గబట్టుకుని "అడగండి" నెమ్మదిగా అన్నారు కృష్ణమూర్తి గారు.

"కట్నం యాభై వేలు. వెండి పాత్రలు, స్టీలు పాత్రలు వగైరా ముప్పై వేలు. మంచం, పరుపు, బీరువా వగైరాలు ఇరవై వేలు. ఇంకా అవీ ఇవీ అన్నీ కలిపి మూడు, మూడున్నర అవుతుంది. మీ పరిస్థితి తెలిసి అన్నింటి లోనూ ఇరవై శాతం తగ్గించాం! ఏమంటారు?" అడిగారు నారాయణరావు గారు.

"సో!.. పెళ్ళి అనే వ్యాపారంలో డిస్కౌంటుకు మూడున్నర లక్షల వ్యయంతో అల్లుడిని కొనుక్కోవాలన్నమాట!" అని మనసులో అనుకున్న కృష్ణమూర్తి గారు కాసేపు మౌనంగా వుండిపోయారు.

"అబ్బాయి బ్యాంక్ ఉద్యోగి. ప్రమోషన్ కూడా రేపో, మాపో రావచ్చు" అంటూ తన వస్తువు విశిష్టతను గుర్తు చేశారు నారాయణరావుగారు.


"అమ్మయి కూడా బ్యాంకి ఉద్యోగే కదండీ!" అని అనగలిగేరు కృష్ణమూర్తి గారు.

"అందుకేనండీ! మేము ఎక్కువ అడగలేదు, ఆలోచించండి. జాతకాలు పొందిగ్గా వున్నాయి. పిల్లలు ఉభయులూ చక్కని సంసార జీవితం గడిపే అవకాశాలు వున్నాయి. అంత కన్నా కావలసిందేముందండీ!" బేరం తగ్గేది లేదన్నట్టు నారాయణరావు గారి మాటలు.

"మీరు కాస్త దిగివస్తే బావుంటుందండీ!" ఎలాగైనా బేరం కుదుర్చుకోవాలన్నది కృష్ణమూర్తి గారి ఆశ.

"చూడండి! తొందరేమీ లేదు. పది రోజులు టైం తీసుకోండి. కానీ అడిగిన వాటిలో మాత్రం ఏదీ తగ్గించలేము!" –నారాయణరావు గారి సతీమణి కాంతామణి గారు తెగేసి చెప్పారు.

"అలా అనకండమ్మా! కాస్త తగ్గించి అడగండి. మరో అమ్మాయి కూడా పెళ్ళికి వుంది. దాంతో పాటు మా అబ్బాయి బరువు కూడా..గద్గద స్వరంతో ప్రాధేయపడుతున్నారు కృష్ణమూర్తి గారు.



ప్రక్క గదిలో నిల్చున్న జానకికి వీళ్ళ బేరాలు వినిపిస్తున్నాయి. తండ్రి ప్రాధేయపడడం గమనించిన జానకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. యంత్రంలా అరుగుతూ, తిరుగుతూ, తమను ఇంత వాళ్ళను చేశాడు తండ్రి. ప్రయోజకుడవ్వాల్సిన కొడుకు మానసిక వైకల్యంతో బాధపడడంతో వాడి భవిష్యత్తుకు కూడా ఏర్పాటు చేయాల్సిన బాధ్యత తండ్రి మీదనే వుంది. ఆర్థికంగా బలహీనంగా వున్న కుటుంబం తనది. పెళ్ళి చేసుకోను నాన్నా! అంటే వినకుండా "లోకులు మరోలా అనుకుంటారమ్మా" అని బలవంతంగా పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు".

'మీరు పది రోజులు ఆలోచించి ఉత్తరం రాయండి. తగ్గే ప్రసక్తి మాత్రం లేదండీ!" కాస్త కటువుగా చెప్పారు కాంతామణి గారు.

మరో పది నిమిషాల్లో పెళ్ళి చూపులకు వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు.

కృష్ణమూర్తి గారు నాలు కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నారు. పేరయ్య గారు మళ్ళీ వచ్చారు. కృష్ణమూర్తి గారితో మాట్లాడడానికి.

** ** ** ** **

బ్యాంక్‌లో లంచ్‌టైంలో రమేష్ దగ్గరికి వచ్చిన భాస్కరం "బాసూ! నీకొక గ్లాడ్ న్యూస్" అన్నాడు.

"ఏమిటో? ప్రమోషనా?' అడిగాడు రమేష్

'యస్. ఫ్యామిలీలో.. లైఫ్‌లో.. నా పెళ్ళి కుదిరిందిరా.. వచ్చే నెలే పెళ్ళి." అన్నాడు భాస్కరం.

"లక్కీ ఫెలో.. అమ్మాయి ఎవరో.? అడిగాడు రమేష్

"ఇదిగో.. ఈ అపురూప లావణ్యావతి...మిస్ జానకి.. కెనరా బ్యాంక్‌లో క్లర్క్" అంటూ జేబులో నుంచి ఫొటో తీసి చూపించాడు భాస్కరం.

రమేష్ ముఖం పాలిపోయింది. తమాయించుకుంటూ "కంగ్రాట్స్! అమ్మాయి చాలా బావుంది. ఇంతకీ ఎంతలో సెటిల్ చేశావు?" వ్యాపారుపరంగా అడిగాడు రమేష్

"బొత్తిగా ఏమీ మాట్లాడకుండా ఓకే చేశాను. మా అమ్మా నాన్నా అంత, ఇంత అని అడగలేదు". "మీరెంత ఇస్తే అంతేనన్నారు" అంతే!

'ఆదర్శ వివాహమన్నమాట! అన్నాడు రమేష్

"యస్.. ఆ అమ్మాయి అందమైనది. ఉద్యోగం చేస్తున్నది. పాపం ఒక వికలాంగునికి అక్కయ్య. అటువంటి వ్యక్తితో జీవితాన్ని పంచుకోవడంలో ఒక తృప్తి వుంది. కట్నాలు, కానుకలు ఎంత కాలం వుంటాయి? మనకు సంపాదించే చేవ వున్నప్పుడు.. బలవంతంగా డబ్బు గుంజడం ఎందుకని? ఆత్మగౌరవంతో చేసుకుంటున్న వివాహం' అన్నాడు భాస్కరం. మరోసారి కంగ్రాట్స్ చెప్పి తన డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళిపోయాడు రమేష్. అతని మనసెందుకో చిందర వందరగా ఏవేవో ఆలోచిస్తోంది. సాయంత్రం ఇంటికి వెళ్ళినప్పుడు తల్లి చెప్పింది. " రేపు హిమాయత్ నగర్‌లో పెళ్ళిచూపులకు వెళ్ళాలి. ఆ కూకట్‌పల్లి వాళ్ళు తాము అంత ఇచ్చుకోలేమని రాశారు" అని.

"ఏదీ ఆ ఉత్తరం?" అని అడిగి తీసుకుని చదవసాగాడు రమేష్

శ్రీ నారాయణరావు గారికి నమస్కారం. ఆడపిల్ల పెళ్ళి సంతలో వ్యాపారంగా మారిన ఈరోజుల్లో పెళ్ళికొడుకులు అమ్ముడు పోయే బొమ్మలైనప్పుడు, తక్కువ ధరలో మంచి బొమ్మను కొనడానికి ప్రయత్నించడం మానవ నైజం. ఒకొక్కప్పుడు ఈ వ్యారంలో ఆత్మగౌరవం, మంచితనం, దయాగుణం వున్న వ్యక్తులు తారసపడతారు వారు బేరాలు చేయరు. "ఎంత ఇస్తారో అంత ఇవ్వండి, మీకు బొమ్మ అంతగా నచ్చింది కనుక" అనడం జరుగుతుంది. మా పరిస్థితిని అర్థం చేసుకున్న మరో అబ్బాయి జానకిని పెళ్ళి చేసుకోవడానికి ముందుకు వచ్చాడు. మీరు ఇరవై శాతం డిస్కౌంటు ఇచ్చారు కానీ ఆ అబ్బాయి తాలూకు వాళ్ళకు నేను నా శక్తిమేరకు ఘనంగా పెళ్ళి చేయిస్తానని చెప్పాను. ఆ పెళ్ళి ఖర్చు మీరు అడిగిన దానిలో మరో ముప్పై శాతం డిస్కౌంటు పోగా మిగిలినంత. కనుక మీరు మీ అబ్బాయికి వేరే సంబంధం చూసుకోవలసిందిగా మనవి చేస్తున్నాము. పెళ్ళి శుభలేఖ పంపిస్తాను. తప్పక వచ్చి వధూవరులను ఆశీర్వదించండి.

– ఇట్లు కృష్ణమూర్తి.

ఉత్తరం చదివిన రమేష్‌కు తానొక సంతపశువుగా, తన తల్లిదండ్రులు తనను వేలం వేసేవాళ్ళుగా అన్పించారు. సొంత వ్యక్తిత్వం లేకపోవడం వల్ల తాను కోల్పోయిందేమిటో తెలుసుకున్నాడు. పశ్చాత్తాపంతో అతని కళ్ళు రెండు అశ్రువులు రాల్చాయి. అయినా తాంబూలాలు చేయిదాటాక అనుకోవడం వల్ల ప్రయోజనం ఏముంది? మూగగా రోదిస్తోంది అప్పుడే పుట్టిన అతని మనసు.

